# సింగరేణి విశ్రాంత ఉద్యోగుల నూతన కమిటీ ఎన్నిక

- అధ్యక్షుడిగా గజ్జెల్లి వెంకటయ్య ఏకగ్రీవం
- గౌరవ అధ్యక్షుడిగా రాళ్లబండి రాజన్న, ప్రధాన కార్యదర్శిగా పూదరి నరసయ్య
- కనీస పెన్షన్ 15,000కు పెంచాలని కీలక తీర్మానం
- మెడికల్ కార్డు పరిమితి 25 లక్షలకు పెంచాలని డిమాండ్
- భారీగా తరలివచ్చిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా విశ్రాంత కార్మికులు



**నేటి సాక్షి, మంచిర్యాల( శ్రీధర్ దమ్ము):**మంచిర్యాల జిల్లా కేంద్రంలో సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సర్వసభ్య సమావేశం సోమవారం అత్యంత ఘనంగా నిర్వహించబడింది. బెల్లంపల్లి, మందమర్రి, రామకృష్ణాపూర్, శ్రీరాంపూర్ తదితర ప్రాంతాల నుండి విశ్రాంత కార్మికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. శ్రమ శక్తి అవార్డు గ్రహీత పెట్టం లక్ష్మణ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

**నూతన కార్యవర్గ వివరాలు:**

జిల్లా అధ్యక్షుడిగా గజ్జెల్లి వెంకటయ్య, గౌరవ అధ్యక్షుడిగా రాళ్లబండి రాజన్న, ప్రధాన కార్యదర్శిగా పూదరి నరసయ్య, కోశాధికారిగా బింగి రాజేశం ఎన్నికయ్యారు. వీరితో పాటు ఉపాధ్యక్షులుగా ఏ. గంగయ్య, రేణిగుంట్ల కొమురయ్య, ఎం.ఎ. రహమాన్, పానుగంటి పోశయ్య, నూనె మల్లయ్య, బూర్ల జ్ఞాని బాధ్యతలు చేపట్టారు. కార్యదర్శులుగా జెట్టి మురహరి, సుంకరి రమేష్ సహా 10 మందిని, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా మంచి రాజేశ్వర్, కంతం సతీష్ సహా ఏడుగురిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

**కీలక తీర్మానాలు, డిమాండ్లు:**

ఈ సందర్భంగా అసోసియేషన్ పలు కీలక తీర్మానాలను ఆమోదించింది. ప్రధానంగా, సింగరేణి బొగ్గు పెన్షన్ దారుల కనీస పెన్షన్‌ను 15,000కు పెంచాలి. కరువు భత్యంతో కూడిన పెన్షన్ అమలు చేయాలి. సిపిఆర్ఎంఎస్ (CPRMS) మెడికల్ కార్డు పరిమితిని 8 లక్షల నుంచి 25 లక్షలకు పెంచాలి. విశ్రాంత ఉద్యోగులకు గ్రాట్యుటీ 20 లక్షలు చెల్లించడంతో పాటు, ఇల్లు లేని వారికి కంపెనీ క్వార్టర్లు కేటాయించాలి. ప్రభుత్వ పథకాలైన ఆసరా పెన్షన్, ఆరోగ్యశ్రీ, రేషన్ కార్డులను వర్తింపజేయాలి. విశ్రాంత ఉద్యోగుల హక్కుల సాధన కోసం సంఘం నిస్వార్థంగా పోరాడుతుందని, కార్మికులంతా ఐక్యంగా ఉండాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న విశ్రాంత సింగరేణి కార్మికులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

# గొల్లపల్లిలో బిజెపి 47 వ ఆవిర్భావ దినోత్సవం



**నేటి సాక్షి, జగిత్యాల,(గుండ ప్రశాంత్ గౌడ్):** గొల్లపల్లి మండల కేంద్రంలో మండల శాఖ ఆధ్వర్యంలో బిజెపి 47వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షులు చెవులమద్ది శేఖర్ మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ వార్త పత్రికల్లో టీవీ చానెళ్లలో యూట్యూబ్ వెలుగుల్లో పుట్టిన పార్టీ కాదు లక్షలాది మంది కార్యకర్తల త్యాగాలపై వేలాదిమంది బలిదానాల స్ఫూర్తిలో పుట్టిన పార్టీ ఇది ఏసీ గదుల్లో పెద్ద పెద్ద భవంతుల్లో ఎదిగిన పార్టీ కాదు బస్తీల్లో గ్రామాల్లో పల్లెటూళ్లలో పేదవాడి భుజం భుజం కలిపి నడిచిన పార్టీ భారతీయ జనతా పార్టీ డా. శ్యాంప్రసాద్ ముఖర్జీ ఆశయాలనుండి పుట్టిన పార్టీ.పండిట్ దీనదయాళ్ ఆలోచనలనుండి పుట్టిన పార్టీ అటల్ బిహారీ వాజపేయి ఆచరణనుండి స్ఫూర్తి పొందిన పార్టీ.అద్వానీ ఆందోళనలనుండి ఎదిగిన పార్టీ నరేంద్రమోడీ దర్శనికతలో నడుస్తున్న పార్టీ అమిత్ షా చాణక్యంలో ఎదుగుతున్న పార్టీ భారతీయ జనతా పార్టీ అంటే కేవలం ఒక కుటుంబమో ఒక వ్యక్తో లేదా ఒక వర్గంకోసమో పనిచేస్తున్న పార్టీ కాదు.ప్రతి ఒక్క భారతీయుడి ఆకాంక్షల సాకారం కోసం దేశం, ధర్మం మాత్రమే కేంద్రంగా పనిచేస్తున్న కార్యకర్తల సంఘటననే భారతీయ జనతా పార్టీ అని అన్నారు ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు కట్ట మహేష్ మండల ఉపాధ్యక్షులు కట్ట క్రాంతి మండల ప్రధాన కార్యదర్శి దుస ప్రశాంత్ కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు బైరం రాజన్న దళిత మోర్చా మండల అధ్యక్షుడు గుంటుకుల జగదీష్ పట్టణ అధ్యక్షులు సంఘం కళ్యాణ్ బిజెపి సీనియర్ నాయకులు బైరం నారాయణ కనుకుంట్ల రాంరెడ్డి మరికంటి రవి బుర్రవేణి తిరుపతి సరసాని అనిల్ రెడ్డి చెవుల మధ్య కార్తీక్ ఒరగంటి రాకేష్ రాజకుమార్ భీమ జలపతి పార్టీ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు

# గ్రామ గ్రామానికి వెళ్లి సమస్యలు పరిష్కరిస్తా మంత్రి అడ్లూరి

## కళ్యాణ లక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



**నేటి సాక్షి, ఎండపల్లి:** ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామాన్ని సందర్శించి సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. సోమవారం జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎండపల్లి, వెల్గటూర్ మండలాలకు చెందిన లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మంత్రి ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి రెండు దిశల్లో ముందుకు సాగుతోందన్నారు. ఆర్థిక పరిమితులు ఉన్నప్పటికీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుకు కట్టుబడి పనిచేస్తున్నామని తెలిపారు. ఆరు గ్యారంటీల్లో నాలుగింటిని ఇప్పటికే అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు రాజకీయాలకు అతీతంగా ప్రజల మధ్య ఉండి వారి సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ఉందన్నారు. ధర్మపురి నియోజకవర్గంలో ప్రతి గ్రామాన్ని సందర్శిస్తూ సమస్యలను గుర్తించి తక్షణ చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎండపల్లి, వెల్గటూర్ మండలాలకు చెందిన 32 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. అలాగే వివిధ ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందిన 78 మందికి రూ.25.40 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ముగ్గురు దివ్యాంగులకు స్కూటీలు అందజేసి వారి జీవనోపాధికి తోడ్పాటునందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# హిందూ సంస్కృతిపై అవగాహన అవసరం





- **సమరసత సమ్మేళనంలో డాక్టర్ నక్కరాజు పిలుపు**

**నేటి సాక్షి, జగిత్యాల(రాధారపు నర్సయ్య):** జాతీయవాదం, హిందూ సంస్కృతి సాంప్రదాయాల పట్ల ప్రతి ఒక్కరికీ అవగాహనతో కూడిన అభిమానం ఉండాలని డాక్టర్ నక్కరాజు అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని గీత భవన్‌లో సోమవారం నిర్వహించిన విశ్వహిందూ పరిషత్ సమరసత సమ్మేళనంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, హిందుత్వం అనేది కేవలం మతతత్వాన్ని బోధించడమే కాకుండా సమగ్ర జీవన విధానాన్ని నేర్పించే తత్వమని పేర్కొన్నారు. బాబు జగ్జీవన్ రావు, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, మహాత్మా జ్యోతిరావు పూలే జయంతుల సందర్భంగా ఈ సమ్మేళనం నిర్వహించడం ఆనందదాయకమని, మహనీయుల ఆలోచనలు సమాజంలో సమానత్వం, సమరసతను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని వివరించారు. హిందుత్వం చరిత్రను ప్రస్తావిస్తూ 19వ శతాబ్దంలో ప్రారంభమైన హిందూ పునర్జీవన ఉద్యమాలు, అనంతరం వీర సావర్కర్ ప్రతిపాదించిన హిందుత్వ భావనలు దేశవ్యాప్తంగా విస్తరించాయని, స్వాతంత్ర్యం తర్వాత రాజకీయంగానూ ప్రాముఖ్యత సంతరించుకున్నాయని డాక్టర్ నక్కరాజు తెలిపారు. నేటి పరిస్థితుల్లో కూడా హిందూ సంస్కృతి, సాంప్రదాయాల ప్రాధాన్యం పెరుగుతోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వినాయక రావు దేశ్‌పాండే హిందుత్వం ప్రాముఖ్యత, దాని చరిత్రపై విపులంగా వివరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బోయిని పద్మాకర్, కార్యదర్శి కస్తూరి రాజన్న, నగర అధ్యక్షుడు బిట్టవేణి అరుణ్ కుమార్ తదితరులతో పాటు సుమారు 200 మంది హాజరై సమ్మేళనాన్ని విజయవంతం చేశారు.

# ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశం



**నేటి సాక్షి నారాయణపేటం(ఇమామ్ సాబ్ ):** పేదల ఇళ్ల కల సాకారం నూతన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. నారాయణపేట జిల్లాలోని నర్వ మండల పరిధిలోని పెద్ద పెద్దకడ్మూర్ గ్రామంలో నూతనశీగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను సర్పంచ్ నాయిని గోవింద్ సోమవారం నాడు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రామన్ గౌడ్,వడ్ల నారాయణ, సత్యం, రాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులపై అసభ్య ప్రవర్తన

## గురుకుల టీచర్‌ను సస్పెండ్ చేయాలని విద్యార్థి సంఘాల డిమాండ్



**నేటి సాక్షి, నారాయణపేట,(ఇమామ్ సాబ్):** నారాయణపేట జిల్లా కేంద్రంలోని మైనార్టీ గురుకుల బాలుర పాఠశాలలో విద్యార్థుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న ఉపాధ్యాయుడిని వెంటనే విధుల నుంచి తొలగించాలని ఎస్ఎఫ్ఐ, పిడిఎస్యు, ఏబీవీపీ విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. సోమవారం విద్యార్థి సంఘాల నాయకులు పాఠశాలను సందర్శించి విద్యార్థుల నుంచి వివరాలు సేకరించారు. 9వ తరగతి చదువుతున్న విద్యార్థుల పట్ల సిరాజ్ ఉద్దీన్ అనే ఉపాధ్యాయుడు రాత్రి వేళల్లో అసభ్యంగా ప్రవర్తిస్తూ వేధింపులకు గురిచేస్తున్నాడని నాయకులు ఆరోపించారు. ఈ విషయం తెలిసినా ప్రిన్సిపాల్ ఖాజా మైనుద్దీన్ సదరు ఉపాధ్యాయుడిని వెనకేసుకొస్తూ, ఘటనను కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తున్నారని వారు మండిపడ్డారు. పాఠశాలలోని సీసీ కెమెరాలను పర్యవేక్షించడంలో ప్రిన్సిపాల్ నిర్లక్ష్యం వహించడం వల్లే ఇటువంటి అరాచకాలు జరుగుతున్నాయని విమర్శించారు. తక్షణమే బాధ్యుడైన ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేయాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన ప్రిన్సిపాల్‌పై కూడా శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్త ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు నరహరి, పిడిఎస్యు రాష్ట్ర సహ కార్యదర్శి సాయికుమార్, ఏబీవీపీ జిల్లా కన్వీనర్ నరేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు భాను ప్రసాద్, పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ విగ్రహ నిర్మాణానికి మార్గం సుగమం



**నేటి సాక్షి :** కోసిగి మండలంలో ఆరు సంవత్సరాలుగా కోర్టు కేసుల కారణంగా నిలిచిపోయిన అంబేద్కర్ విగ్రహ నిర్మాణ సమస్యకు పరిష్కారం లభించింది. సోమవారం మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి సమస్యను పరిశీలించి, ఇరు వర్గాలను గ్రామ పెద్దల సమక్షంలో ఒకే వేదికపై కూర్చోబెట్టి చర్చల ద్వారా సామరస్యంగా పరిష్కరించారు. ఈ పరిష్కారంపై కోసిగిలోని మూడు ఎస్సీ కాలనీల దళితులతో పాటు మండలంలోని ఇతర దళితులు సంతోషం వ్యక్తం చేశారు. కడపాలెం, సిద్ధప్పపాలెం, నడిమిపాలెం గ్రామాలకు చెందిన దళితులు రాఘవేంద్ర రెడ్డిని ఘనంగా సన్మానించి, పూలమాలలు వేసి అభినందించారు. అంబేద్కర్ విగ్రహ నిర్మాణానికి తమవంతు పూర్తి సహాయ సహకారం అందిస్తామని వారు తెలిపారు.

# భూగర్భ జలాల పెంపుతోనే నీటి భద్రత సాధ్యం



**నేటి సాక్షి :** భూగర్భ జలాల స్థాయిని పెంచి నీటి భద్రత సాధించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని రాష్ట్ర రైతు అధికార ప్రతినిధి, డిస్ట్రిబ్యూటర్ చైర్మన్ నరవరమాకంతర రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పెద్దకడబూరులో నిర్వహించిన “నీటి భద్రత - సాగునీటి సంఘాల బాధ్యత” కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సీఎం ఆలోచనల మేరకు భూగర్భ జలాలు కనీసం 3 మీటర్ల లోతులో ఉండేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని కాలువల అభివృద్ధి, కాలువలపై రహదారుల నిర్మాణం వంటి పనులను 100 రోజుల కార్యాచరణలో భాగంగా చేపట్టాలని అధికారులను కోరారు. నీటి వనరుల సమర్థ వినియోగం కోసం సాగునీటి సంఘాలు, రైతులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు.

TGTEL/25/A1737 | NETI SAKSHI

## సీఎస్ఐ ఆలయనికి విరాళం

**దాతృత్వానికి ప్రశంసలు**



**నేటి సాక్షి :** పెద్దకడబూరు మండల కేంద్రంలో నూతనంగా నిర్మాణంలో ఉన్న సీఎస్ఐ ఆలయానికి గ్రామానికి చెందిన గుమ్మల రాజేశ్ దంపతులు రూ.లక్ష విరాళం అందజేశారు. ఈస్టర్ పండుగ సందర్భంగా స్థానిక సంఘ కాపరి ముత్తు మనోహర్ బాబుకు ఆ విరాళాన్ని అందించి తమ భక్తిని చాటుకున్నారు. ఈ సందర్భంగా పాస్టర్ మాట్లాడుతూ, ఆలయ నిర్మాణం మరియు అభివృద్ధికి భక్తుల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. గుమ్మల రాజేశ్ దంపతుల దాతృత్వాన్ని అభినందిస్తూ, వారి సహాయం చర్చి సేవా కార్యక్రమాలకు ఎంతో దోహదపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక భక్తులు పాల్గొని దాతలను అభినందించారు.

## నూతన వార్డు సభ్యులకు శిక్షణ



**నేటి సాక్షి గన్నేరువరం,(బుర్ర అంజయ్యగౌడ్ ):** మండలంలోని చీమలకుంటపల్లి గుండ్లపల్లి, గుండ్లపల్లి × రోడ్డు గునుకుల్ కొండాపూర్ గోపాలపూర్ హనుమాజి పల్లి జంగాపల్లి మాదాపూర్ గ్రామాలకు తేదీ 06,04,2026 నుండి తేదీ10/04/2026 వరకు రెండో బ్యాచ్ లకు జనరల్ ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించడం జరుగుతుంది. ఎట్టి ఓరియంటేషన్ ప్రోగ్రాంలో నూతనంగా ఎన్నిక కాబడిన వార్డు సభ్యులకు తెలంగాణ పంచాయతీ రాజ్ యాక్ట్ మరియు ఆదర్శ గ్రామాల ప్రణాళిక శానిటేషన్ ఈ పంచాయతీ అప్లికేషన్ బిల్డింగ్ పర్మిషన్ పన్నుల వసూలు రికార్డ్ మెయింటెనెన్స్ ఉపాధి హామీ మంచినీటి సరఫరా ఆదాయ వ్యయాలు మరియు వార్డ్ మెంబర్లకు విధులు గురించి శిక్షణ ఇవ్వడం జరిగింది ఇట్టి కార్యక్రమంలో గౌరవ ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి గారు ఎంపీఓ సురేందర్ గారు టిఓటిలు పంచాయతీ కార్యదర్శులు కార్యాలయం సిబ్బంది వార్డ్ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు

## బిజెపి జెండా ఆవిష్కరన

**కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్**



**నేటి సాక్షి,గన్నేరువరం,(బుర్ర అంజయ్య గౌడ్):** గన్నేరువరం బీజేపీ మండల అధ్యక్షుడు తిప్పర్తి నికేష్ ఆధ్వర్యంలో కేంద్రం సహాయం మంత్రి బండి సంజయ్ కి బిజెపి శ్రేణులు ఆయనకు ఘన స్వాగతం పలికారు అనంతరం కార్యక్రమంలో భాగంగా బిజెపి ఆవిర్భావ దినోత్సవం వేడుకల్లో భాగంగా సోమవారం రోజున గుండ్లపల్లి స్టేజి వద్ద బిజెపి పార్టీ జెండాను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ ఆవిష్కరించారు. బిజెపితోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వినుకొండ నాగేశ్వర్ నాయకులు కరివేద మైపాల్ రెడ్డి, సర్పంచ్ సొల్లు అజయ్ వర్మ, డాక్టర్ పుల్లెల పవన్ కుమార్, ఏలేటి చంద్ర రెడ్డి బొమ్మిడి సురేందర్ రెడ్డి, పుల్లెల రాము, మచ్చ సాయికృష్ణ,హరీష్ తదితరులు పాల్గొన్నారు.అనంతరం కార్యక్రమానికి గన్నేరువరం ఎస్సై జి నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

## కాంగ్రెస్‌ను వీడి బీజేపీలోకి



**నేటి సాక్షి, ఎండపల్లి:** మండలంలోని అంబారిపేట గ్రామానికి చెందిన ఉమ్మడి వెల్గటూర్ మండల మాజీ వైస్ ఎంపీపీ మామిడిపల్లి విజయ ప్రసాద్ సోమవారం కాంగ్రెస్ పార్టీని వీడి బీజేపీలో చేరారు. బీజేపీ 46వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అంబారిపేటలో నిర్వహించిన జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో తన అనుచరులతో కలిసి పార్టీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా అసెంబ్లీ కన్వీనర్ కొమ్ము రాంబాబు ఆయనను పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం విజయ ప్రసాద్ మాట్లాడుతూ కాంగ్రెస్‌లో కార్యకర్తలకు గుర్తింపు లేదని, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వం పట్ల ఆకర్షితుడై బీజేపీలో చేరినట్లు తెలిపారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేస్తానని, రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు రావు హన్మంత రావు, నాయకులు ప్రమోద్ గౌడ్, మంచికట్ల రవి, గోపినవేని గంగాచలం, మామిడిపల్లి రమేష్, ముచ్చర్ల రాజు, ఎర్రోజు శ్రీనివాస్, మామిడిపల్లి మధుకర్, మెడపట్ల శిరీష్, మామిడిపల్లి సత్తయ్య, ఆరేల్లి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ





**నేటి సాక్షి, మేడిపల్లి:** మేడిపల్లి మండల కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ ఆదేశాల మేరకు మేడిపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఏనుగు రమేష్ రెడ్డి, మండల మార్కెట్ కమిటీ చైర్మన్ మాదం వినోద్ యాదవ్ ,ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఈరోజు సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.క్యాతం లక్ష్మి 60.000 బొంగోని లక్ష్మి 27.500 చెక్కులను అందించారు .ఈ కార్యక్రమంలో మేడిపల్లి మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి చేపూరి నాగరాజు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బలగం రాజేష్, నాయకులు ఉరుమడ్ల నర్సయ్య, మాజీ ఎంపిటిసి దాసరి శంకర్, కుంట నారాయణ, యూత్ సభ్యులు మార్గం నవీన్, మధు, చందు, రాజేందర్, దేవగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను లబ్ధిదారులకు అందించాలి





- ఎమ్మెల్యే బిఎల్ఆర్ తో కలసి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పరిశీలించిన..కలెక్టర్ చంద్రశేఖర్

**నేటిసాక్షి, మిర్యాలగూడ :** పట్టణంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి తో కలసి సోమవారం నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు ఇళ్ల నిర్మాణం, మౌలిక వసతుల పనుల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పెండింగ్ పనులను తక్షణమే పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా తాగునీటి సరఫరా, విద్యుత్ సదుపాయం, ప్లంబింగ్ పనులు, టాయిలెట్లు, కిచెన్ ఏర్పాట్లు, రోడ్లు మరియు డ్రైనేజ్ వంటి మౌలిక వసతులు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. ఇళ్లన్నీ పూర్తిస్థాయిలో సిద్ధం చేసి, ఈ నెలాఖరులోగా (ఏప్రిల్) లబ్ధిదారులకు అందించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు అందజేశారు. లబ్ధిదారులకు నాణ్యమైన వసతులు కల్పించడంలో ఎటువంటి రాజీ ఉండదని తెలిపారు. వారి వెంట మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, జిల్లా గృహ నిర్మాణం పిడి రాజ్ కుమార్, మిర్యాలగూడ తహసిల్దార్ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, ఆర్ అండ్ బి ఎస్ఈ శ్రీధర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# మరణాన్ని గెలిచిన మహోన్నతుడు ఏసుక్రీస్తు





- ఎస్‌ఏపి క్యాంప్ సిఎస్ఐ చర్చిలో ఘనంగా ఈస్టర్ వేడుకలు
- ప్రేమ, క్షమాపణలే క్రైస్తవ మార్గమని ఉద్ఘాటన
- భక్తిశ్రద్ధలతో పాల్గొన్న క్రైస్తవ సోదరులు.. అన్నదాన కార్యక్రమం
- విశ్వాసులకు తీపి పదార్థాల పంపిణీ

**నేటి సాక్షి, కర్నూలు:** నగరంలోని ఎస్‌ఏపి క్యాంప్ సిఎస్ఐ సంఘం ఆధ్వర్యంలో ఈస్టర్ పండుగ వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో, ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చి పాస్టర్ మరియు డీనరీ చైర్మన్ రెవరెండ్ వేల్పుల ప్రసాద్ బాబు దైవ సందేశం ఇస్తూ.. ఏసుప్రభువు మరణాన్ని గెలిచి తిరిగి లేవడమనేది యావత్ ప్రపంచానికి గర్వకారణమని పేర్కొన్నారు. పునరుత్థాన క్రీస్తు చూపిన ప్రేమ, దయ, శాంతి మార్గాలు సమస్త మానవాళికి అనుసరణీయమని తెలిపారు. సమాజంలో పగలు, ద్వేషాలు వీడి అందరూ సమానత్వంతో మెలిగినప్పుడే నిజమైన క్రైస్తవ జీవితం సాధ్యమవుతుందని ఉద్ఘాటించారు. ఉమెన్స్ ఫెలోషిప్ ప్రెసిడెంట్ వేల్పుల శాంతకుమారి మాట్లాడుతూ.. సర్వ మానవాళి పాప విమోచన కోసం క్రీస్తు సిలువ మరణం పొందారని, ముందుగా చెప్పినట్లుగానే మూడవ రోజున సమాధి నుండి సజీవుడై తిరిగి లేచారని వివరించారు. రోమా ప్రభుత్వం అత్యంత భద్రత కల్పించినప్పటికీ, మరణాన్ని జయించిన ఏకైక రక్షకుడు ఏసుక్రీస్తు అని కొనియాడారు. ఆరాధన అనంతరం విశ్వాసులందరికీ ఆశీర్వాద భోజనాలు (అన్నదానం) ఏర్పాటు చేశారు. వెంకటరమణ కాలనీకి చెందిన దుర్గా స్వీట్స్ వారు భక్తులందరికీ మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చర్చి సెక్రటరీ పట్నం డేవిడ్, ట్రెజరర్ డాక్టర్ హెప్సీబా రాణి, ఉమెన్స్ ఫెలోషిప్ సెక్రటరీ నిర్మలా పద్మ, కమిటీ సభ్యులు మరియు పెద్ద సంఖ్యలో క్రైస్తవ విశ్వాసులు పాల్గొన్నారు.

# జలధార నీటి భద్రత కార్యక్రమం లో పాల్గొన్న ఎమ్మెల్యే





**నేటి సాక్షి, జూపాడుబంగ్లా:** నందికొట్కూరు నియోజకవర్గంలోని జూపాడు బంగ్లా మండలం తంగడంచ గ్రామంలో పెద్ద కుంట చెరువు దగ్గర నిర్వహించిన "జలధార – నీటి భద్రత" కార్యక్రమంలో నందికొట్కూరు శాసనసభ్యులు గిత్త జయసూర్య గారుపాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో జూపాడుబంగ్లా ఎంపిడిఓ గోపీకృష్ణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు ఈ కార్యక్రమం నికి ముఖ్య అతిథిగా నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య హాజరు కావడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గిత్త జయసూర్య వారు మాట్లాడుతూ ఇది నీటి భద్రత కోసం రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న బృహత్తర యజ్ఞం అన్నారు పరిగెత్తే నీటిని నిలబెట్టాలి, నిలబడిన నీటిని నిల్వ చేయాలి, జలాశయాలు నింపేందుకు ప్రయత్నించాలి అన్నారు. ప్రతి నీటి బొట్టునూ ఒడిసిపట్టేలా చూడాలని చంద్రబాబు స్పష్టంచేశారు "రాష్ట్రస్థాయి నుంచి క్షేత్రస్థాయి వరకూ నీటి భద్రతపై ప్రత్యేక దృష్టి సారించేలా కార్యాచరణ ఉండాలని అన్నారు ప్రతి నీటి చుక్కనూ సంరక్షించడం, ప్రతి ఎకరాకూ నీరందించడం, ప్రతి రైతుకూ భరోసా ఇవ్వడమే ఈ కార్యక్రమం అన్నారు గ్రామ పంచాయతీల భాగస్వామ్యంతో సాగునీటి సంఘాలు డ్రైవింగ్ ఫోర్సుగా ఉండాలి నీరు మనందరికీ సర్వస్వం... దానిని సంరక్షించుకోవడానికే వంద రోజుల యాక్షన్ ప్లాన్ చేపట్టాం. నీటి భద్రత కోసమే కూటమి ప్రభుత్వం మన ముఖ్యమంత్రి గౌరవ నారా చంద్రబాబునాయుడు పనిచేస్తున్నారు ఉన్నారు ఈ కార్యక్రమంలో: పిక్కిలి శ్రీనివాసులు, శ్రీనివాస్ రెడ్డి, కట్ట పరమేశ్వర్ రెడ్డి, ప్రసన్న రెడ్డి, గిరీశ్వర్ రెడ్డి, వెంకటేశ్వర్లు, ఎంపీపీ మిద్దె నీలమ్మ, వేణుగోపాల్ రెడ్డి, రవికాంత్, నాగిరెడ్డి, ప్రభుత్వ అధికారులు, తంగేడంచ గ్రామ సచివాలయం అధికారులు రైతులు మండల నాయకులు గ్రామ రైతులు పాల్గొనడం జరిగింది

# కోరుట్లలో ఎల్‌పీజీ అక్రమ వినియోగంపై దాడులు



- 48 గ్యాస్ సిలిండర్లు పట్టివేత
- హోటళ్లు, వ్యాపార కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు
- గృహ వినియోగ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వినియోగం వెలుగులోకి
- సివిల్ సప్లై, రెవెన్యూ శాఖల సంయుక్త చర్యలు
- అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు: డీటీ ఉమాపతి హెచ్చరిక

**నేటి సాక్షి, కోరుట్ల (రాధారపు నర్సయ్య):** కోరుట్ల పట్టణంలో గ్యాస్ సిలిండర్ల అక్రమ వినియోగంపై సివిల్ సప్లై శాఖ, రెవెన్యూ అధికారుల సంయుక్త దాడులు నిర్వహించి మొత్తం 48 ఎల్‌పీజీ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న ప్రత్యేక చర్యలలో భాగంగా ఈ తనిఖీలు చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు. కోరుట్ల పట్టణంలో గృహ వినియోగానికి కేటాయించిన ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్నారన్న సమాచారం మేరకు సివిల్ సప్లై శాఖ, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. పట్టణంలోని పలు హోటళ్లు, చిన్న వ్యాపార కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టి అక్రమ వినియోగాన్ని గుర్తించారు. ఈ దాడుల సందర్భంగా అధికారులు మొత్తం 48 గ్యాస్ సిలిండర్లను పట్టుకుని స్వాధీనం చేసుకున్నారు. గృహ వినియోగానికి ఇచ్చే సబ్సిడీ సిలిండర్లను వ్యాపార అవసరాలకు ఉపయోగించడం చట్టవిరుద్ధమని అధికారులు స్పష్టం చేశారు. ఈ చర్యతో పట్టణంలో అక్రమంగా సాగుతున్న గ్యాస్ వినియోగం పై కొంతవరకు అడ్డుకట్ట పడుతుందని భావిస్తున్నారు. ప్రత్యేకంగా హోటళ్లు, తినుబండార కేంద్రాల్లో ఈ అక్రమ వినియోగం ఎక్కువగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. గృహ వినియోగ సిలిండర్లను తక్కువ ధరకు పొందుతూ వాటిని వ్యాపారంలో వినియోగించడం ద్వారా ప్రభుత్వానికి నష్టం కలిగిస్తున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో తనిఖీలను మరింత విస్తరించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సివిల్ సప్లై డీటీ ఉమాపతి మాట్లాడుతూ.. గృహ వినియోగ గ్యాస్‌ను వాణిజ్య అవసరాలకు వినియోగించడం పూర్తిగా చట్టవిరుద్ధమని హెచ్చరించారు. ఇటువంటి అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి దాడులు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు. ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ల అక్రమ వినియోగంపై ప్రత్యేక డ్రైవ్ కొనసాగుతున్న నేపథ్యంలో కోరుట్లలో ఈ దాడులు నిర్వహించారు. ప్రజలు కూడా ఇలాంటి అక్రమాలపై అప్రమత్తంగా ఉండి అధికారులకు సమాచారం అందించాలని కోరారు. ఈ చర్యలతో గ్యాస్ సరఫరా వ్యవస్థలో పారదర్శకత పెరుగుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# గజ్వేల్ క్యాంపు కార్యాలయంపై దాడి అప్రజాస్వామికం



**నేటి సాక్షి గజ్వేల్ :** సిద్దిపేట జిల్లా గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై జరిగిన దాడిని యావత్ తెలంగాణ ప్రజలపై జరిగిన దాడిగా భావించి తీవ్రంగా ఖండిస్తున్నామని టీఆర్ఎస్ పార్టీ నేతలు వంటేరు ప్రతాపరెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ మాదా శ్రీనివాస్, మండల పార్టీ అధ్యక్షుడు బెండ మధు అన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీపై వారు తీవ్ర విమర్శలు చేశారు. గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై దాడికి నిరసనగా చేపట్టిన గజ్వేల్ బంద్ సందర్భంగా ప్రజ్ఞాపూర్ ఆర్టీసీ డిపో ముందు టీఆర్ఎస్ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అధికార అహంకారంతో కాంగ్రెస్ నేతలు దాడులకు పాల్పడుతున్నారని, 14 ఏళ్ల ఉద్యమంతో తెలంగాణ సాధించిన ఉద్యమకారుడి క్యాంపు కార్యాలయంపై దాడిని రాష్ట్ర ప్రజలందరూ ఖండిస్తున్నారని తెలిపారు.

కాంగ్రెస్ పాలనను ప్రజలు వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో తమ ఉనికిని చాటుకునేందుకే టీఆర్ఎస్ నేతలపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. గత రెండేళ్లలో గజ్వేల్ నియోజకవర్గానికి సరైన అభివృద్ధి నిధులు కేటాయించలేదని విమర్శించారు. దమ్ముంటే సీఎం రేవంత్ రెడ్డితో మాట్లాడి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలని కాంగ్రెస్ నేతలను డిమాండ్ చేశారు.

అధికారం శాశ్వతం కాదని, ప్రజల మనసు గెలుచుకోవాలని కాంగ్రెస్ నాయకులకు హెచ్చరించారు. టీఆర్ఎస్ పార్టీ ఇచ్చిన బంద్ పిలుపుకు పట్టణ ప్రజలు స్వచ్ఛందంగా సహకరిస్తున్నారని పేర్కొన్నారు. గతంలో రైతులు ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి ఉండేదని, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతో రైతులను బలోపేతం చేసి దేశానికి అన్నం పెట్టే స్థాయికి తీసుకెళ్లారని తెలిపారు. ప్రస్తుతం కాంగ్రెస్ పాలనలో కరెంటు, ఎరువులు, విత్తనాల కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. మహాలక్ష్మి పథకం పేరుతో ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తున్నామని చెబుతూ 6 గ్యారంటీలు అమలవుతున్నాయని కాంగ్రెస్ నేతలు గొప్పలు చెప్పుకుంటున్నారని విమర్శించారు. ఆసరా పెన్షన్లు నిలిచిపోయాయని, కళ్యాణలక్ష్మి పథకాన్ని కనుమరుగు చేశారని ఆరోపించారు. కేసీఆర్ కిట్, రైతు బీమా వంటి పథకాలను అమలు చేయకుండా రాజకీయ దాడులకే కాంగ్రెస్ ప్రభుత్వం పరిమితమైందని అన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ నేతలు దాడులను మానుకోకపోతే తెలంగాణ ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు మాజీ ప్రజాప్రతినిధులు, టీఆర్ఎస్ పార్టీ నేతలు పాల్గొన్నారు. పట్టణంలో కాంగ్రెస్, టీఆర్ఎస్ ఇరువు వర్గాలవారు ర్యాలీ నిర్వహించడంతో ఒకరిపై వ్యతిరేక నినాదాలు చేయడంతో కొద్దిసేపు ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. గజ్వేల్ ఏసిపి నర్సింలు ఆధ్వర్యంలో గజ్వేల్ పట్టణంలో పెద్ద ఎత్తున పోలీసులతో ఏర్పాటు చేశారు.

# కోరుట్లలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవం



- శ్రీ వెంకటేశ్వర మందిరం వద్ద జెండా ఆవిష్కరణ
- శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ, దీన్ దయాళ్ ఉపాధ్యాయ సిద్ధాంతాల ప్రస్తావన

**నేటి సాక్షి, కోరుట్ల (రాధారపు నర్సయ్య):** కోరుట్ల పట్టణంలో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) 46వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ వెంకటేశ్వర మందిరం సమీపంలో పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించి, పార్టీ ఎదుగుదల, సిద్ధాంతాలపై నేతలు విశేషంగా ప్రసంగించారు. కోరుట్ల పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర మందిరం వద్ద బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ అనుప్ రావు, రాష్ట్ర ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షులు రుద్ర శ్రీనివాస్, అల్లాడి ప్రవీణ్, పట్టణ అధ్యక్షుడు కస్తూరి లక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొని బీజేపీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ, పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయల సిద్ధాంతాల స్ఫూర్తితో పార్టీ ముందుకు సాగుతోందన్నారు. ఏకాత్మ మానవతావాదం, అత్యోదయ సిద్ధాంతాలను ఆధారంగా చేసుకుని దేశాభివృద్ధి కోసం బీజేపీ కృషి చేస్తోందని పేర్కొన్నారు. 1980లో కేవలం రెండు లోక్‌సభ స్థానాలతో ప్రారంభమైన బీజేపీ, నేడు ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీగా ఎదిగిందని తెలిపారు. దేశవ్యాప్తంగా 14 కోట్లకు పైగా కార్యకర్తలు ఉన్న పార్టీగా బీజేపీ నిలిచిందని వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రధాన కార్యదర్శి ఎర్ర రాజేందర్, చెట్లపెల్లి సాగర్, కౌన్సిలర్లు తిరుమల వాసు, గుగులోతు శ్రీకాంత్, మాజీ కౌన్సిలర్,బీజేపీ ఫ్లోర్ లీడర్ మాడవేణి నరేష్, సుదవెని మహేష్, ఎంబెరి నాగభూషణం, గిన్నెల శ్రీకాంత్, పోతుగంటి శ్రీనివాస్, చిరుమల్ల ధనుంజయ్, మ్యాకాల గణేష్, తులసి కృష్ణ, మచ్చ శేఖర్, బెక్కం అశోక్, బాలాజీ రావు, రాచమడుగు శ్రీనివాస్ రావు, గిన్నెల అశోక్, తాళ్లపల్లి శ్రీనివాస్, చిట్యాల రాజేందర్, ఒల్లజి నగేష్, రాధారపు సత్యనారాయణ, మైదం సత్యనారాయణ,రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యవర్గ సభ్యులు సొరుపక రమేష్, యువ మోర్చా అధ్యక్షుడు కళాల సాయిచంద్, దమ్మ సంతోష్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు ఎల్లల నారాయణ రెడ్డి, మామిడి మల్లేష్ రెడ్డి, మల్లేశం, అక్మల్, జక్కుల ప్రవీణ్, నరవేని అశోక్, ప్రవీణ్, తైదల ప్రశాంత్, బాల్క ప్రేమ్ సాగర్, కైరంకొండ రాజా, గంగారాం, నల్ల రాజుకుమార్, గోదా శ్రీకాంత్ తదితరులతో పాటు బీజేపీ, బీజేవైఎం కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీ ట్రాక్టర్ ప్రైవేటు పనులకు వినియోగం

## వార్డు సభ్యుల ఆగ్రహం

**నేటి సాక్షి, నారాయణపేట:** ధన్వాడ మండల పరిధిలోని చర్లపల్లి గ్రామ పంచాయతీకి చెందిన ట్రాక్టర్‌ను సొంత పనులకు వాడుతున్నారని వార్డు సభ్యుడు మొగులయ్య సోమవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. గ్రామంలో తడి, పొడి చెత్త సేకరించడానికి, వేసవిలో మొక్కలకు నీళ్లు పట్టడానికి కేటాయించిన ప్రభుత్వ వాహనాన్ని సర్పంచ్, కార్యదర్శి కుమ్మక్కై ప్రైవేటు పనులకు మళ్లించారని ఆయన మండిపడ్డారు. డ్రైనేజీ పనులకు సంబంధించిన సిమెంట్ బస్తాలను తరలించడానికి పంచాయతీ ట్రాక్టర్‌ను వాడటంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై మల్టీపర్పస్ వర్కర్లను నిలదీయగా, సర్పంచ్ ఆదేశాల మేరకే తాము ఈ పనిచేస్తున్నామని సమాధానం ఇచ్చారని మొగులయ్య తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ ఆస్తులను వ్యక్తిగత పనులకు వాడుకోవడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు స్పందించి, బాధ్యులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.



# చౌడేపల్లిలో గంగమ్మ జాతర

## రేపు ఘన ఊరేగింపు



**నేటి సాక్షి, చౌడేపల్లి:** అన్నమయ్య జిల్లా చౌడేపల్లి మండలం పుంగనూరు నియోజకవర్గంలోని చౌడేపల్లిలో గంగమ్మ జాతర వేడుకలు ఉత్సాహభరితంగా ప్రారంభమయ్యాయి. జాతర సందర్భంగా ఈ నెల 7, 8 తేదీలలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్న నేపథ్యంలో, రేపు జరిగే ఊరేగింపు ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. గ్రామం మొత్తం పండుగ వాతావరణంలో మునిగిపోయింది. రేపటి ఊరేగింపులో అమ్మవారిని శోభాయాత్రగా గ్రామ వీధుల మీదుగా తీసుకువెళ్లనున్నారు. ఈ కార్యక్రమంలో యువత పెద్దఎత్తున పాల్గొనడంతో పాటు, పరిసర ప్రాంతాలు మరియు దూర ప్రాంతాల నుంచి కూడా భక్తులు భారీగా తరలివస్తున్నారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తమ మొక్కులు చెల్లించుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జాతర నిర్వహణకు గ్రామ పెద్దలు, యువకులు, నిర్వాహకులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, భద్రత, పారిశుద్ధ్య వంటి ఏర్పాట్లు చేశారు. పోలీసులు కూడా భద్రతా చర్యలను కట్టుదిట్టం చేశారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ, జాతరను శాంతియుతంగా, భక్తి శ్రద్ధలతో నిర్వహించాలని ప్రజలను కోరారు. గంగమ్మ తల్లి ఆశీస్సులతో గ్రామానికి శాంతి, సమృద్ధి కలగాలని ఆకాంక్షించారు.

# మైనర్ బాలిక హత్య కేసు ఛేదన

## నిందితుడి అరెస్ట్



**నేటి సాక్షి, నారాయణపేట (ఇమామ్ సాబ్):** నారాయణపేట మండల పరిధిలో గత నెల 31న ఐదేళ్ల బాలిక అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన కేసును పోలీసులు ఛేదించారు. బాలికపై లైంగిక దాడి చేసి హత్య చేసినట్లు పోస్టుమార్టం నివేదికలో తేలడంతో, జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఆదేశాల మేరకు ఎస్‌డీపీఓ నల్లపు లింగయ్య, డీసీఆర్‌బీ డీఎస్పీ ఏ. మహేష్ పర్యవేక్షణలో 8 ప్రత్యేక బృందాలు దర్యాప్తు చేపట్టాయి. సాంకేతిక ఆధారాల సాయంతో అమ్మిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన బక్క చిన్న నరసింహులు (42) అనే వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల విచారణలో నిందితుడు తన నేరాన్ని ఒప్పుకున్నాడు. నిందితుడిపై గతంలో (2014లో) కూడా అత్యాచార ప్రయత్నం కేసు నమోదైనట్లు విచారణలో వెల్లడైంది. నిందితుడిని అరెస్ట్ చేసి న్యాయమూర్తి ముందు హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. మహిళలు, బాలికలపై జరిగే నేరాలను అరికట్టడంలో కఠినంగా వ్యవహరిస్తామని ఎస్పీ హెచ్చరించారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు. కేసును వేగంగా ఛేదించిన పోలీస్ బృందాన్ని ఎస్పీ అభినందించి రివార్డులను ప్రకటించారు.

# గున్ముకులలో భూముల పరిశీలన

## అధికారుల సందర్శన



**నేటి సాక్షి, నారాయణపేట (ఇమామ్ సాబ్):** నారాయణపేట జిల్లా ధన్వాడ మండల పరిధిలోని గున్ముకుల గ్రామాన్ని సోమవారం మండల స్థాయి అధికారులు సందర్శించారు. ధన్వాడ తహసీల్దార్ సింధుజ, మరికల్ సీఐ భగవంతు రెడ్డి, ధన్వాడ ఎస్సై వెంకటేష్ మరియు మండల ఆర్.ఐ శ్రీనివాసులు ఈ పర్యటనలో పాల్గొన్నారు. గ్రామంలోని పలు సర్వే నంబర్లకు సంబంధించిన భూములను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భూ సమస్యల పరిష్కారం మరియు భూముల స్థితిగతులను తెలుసుకునేందుకు ఈ తనిఖీలు నిర్వహించినట్లు సమాచారం. ఈ సందర్భంగా అధికారులు గ్రామస్తులతో మాట్లాడి వివరాలు సేకరించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం భూముల రికార్డులను సరిచూడటం మరియు క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవ పరిస్థితులను అంచనా వేయడమే ఈ సందర్శన ప్రధాన ఉద్దేశమని అధికారులు పేర్కొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలకు కార్పొరేట్ చేయూత



నేటి సాక్షి, ఎండపల్లి: జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం గుల్లకోట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల అభివృద్ధిలో కార్పొరేట్ సంస్థలు తమ వంతు భాగస్వామ్యం అందిస్తున్నాయి. సీడ్ వర్క్స్ ఇంటర్నేషనల్ (యుఎస్ అగ్రి సీడ్స్ లిమిటెడ్) సంస్థ తమ కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కింద పాఠశాలకు రూ. 1.80 లక్షల నిధులను మంజూరు చేసింది. ఈ నిధులతో పాఠశాల భవనాలకు రంగులు వేయడం, గొట్టపు బావికి కొత్త మోటారు అమర్చడం మరియు విద్యార్థులకు శుద్ధమైన తాగునీటి వసతి కల్పించడం వంటి మౌలిక సదుపాయాల పనులు పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సంస్థ మేనేజర్ సునిల్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో విద్యాభివృద్ధికి సహకరించడం తమ సంస్థ విధానమని తెలిపారు. పాఠశాల మౌలిక వసతుల కల్పనకు సీడ్ వర్క్స్ సంస్థ ముందుకు రావడం అభినందనీయమని ప్రధానోపాధ్యాయుడు చందూరి రాజిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గొల్లపల్లి మల్లేశం గౌడ్, ఎంఈఓ సముద్రాల హరికృష్ణ, పాఠశాల ఉపాధ్యాయులు మరియు సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

